ఇఫ్తార్‌కు కేటీఆర్



వ్యాపారవేత్త సర్వరాజ్ బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లో శనివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలను పూర్తిచేసుకున్నాక కేటీఆర్ పండ్లు తినిపించి ఉపవాసం విరమింపజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, కార్పొరేటర్ వి.వెంకటేష్, సీనియర్ నాయకులు మన్నె గోవర్ధన్‌రెడ్డి, విప్లవ పాల్గొన్నారు. - బంజారాహిల్స్, మార్చి 30(ఆంధ్రజ్యోతి)



రన్ పోస్టరును ఆవిష్కరిస్తున్న యశస్వి మల్క, సాహితి, శృతి, కల్యాణ్

నేడు పీపుల్స్ ప్లాజాలో ది హైదరాబాద్ రన్

పంజాగుట్ట, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పల్లవి గ్రూపు ఆఫ్ స్కూల్స్, స్ట్రీట్ కాస్ హైదరాబాద్, మైఫిట్నెస్ సంస్థల ఆధ్వర్యంలో ఈనెల 31న నక్లెస్ రోడ్డు పీపుల్స్ ప్లాజాలో రన్ ఫర్ కాస్ 10 పేరుతో ది హైదరాబాద్ రన్ జరగనుంది. దీనిలో భాగంగా 5కే రన్, జుంబా, కామెడీ, ఎంటర్‌టైన్‌మెంట్ విత్ బ్యాండ్ ఇలా ఎన్నో కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పల్లవి ఫౌండేషన్ సీఈఓ యశస్వి మల్క,స్ట్రీట్ కాస్ హైదరాబాద్ అధ్యక్షురాలు సాహితి, సీఈఓ శృతి, మైఫిట్నెస్ తెలుగు రాష్ట్రాల సేల్స్ మేనేజర్ కల్యాణ్, దనుశ్రీతో కలిసి రన్ ఫర్ కాస్ 10-ది హైదరాబాద్ రన్ పోస్టర్‌ను ఆవిష్కరించి, వివరాలు వెల్లడించారు. సామాజిక బాధ్యతగా 10వేల మంది కళాశాల విద్యార్థులతో 5కే రన్ నిర్వహిస్తున్నామన్నారు. నగరంలోని పలు కళాశాలలో వలంటీర్లు ఉన్నారు, పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇప్పటి వరకు దేశంలోని ఏడు పట్టణాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తుండగా, 2030 వరకు 30 పట్టణాలకు విస్తరిస్తామని సాహితి అన్నారు. కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, పల్లవి గ్రూపు విద్యా సంస్థల చైర్మన్ మల్క కొమరయ్య, పలువురు సెలబ్రెటీలు ఈ రన్‌లో పాల్గొంటారన్నారు. సమావేశంలో ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దివ్యాంగుల హక్కుల పోరాట నేత నాగినేని జగదీశ్వర్‌రావు

దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

పంజాగుట్ట, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు, నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని దివ్యాంగుల హక్కుల పోరాట నేత నాగినేని జగదీశ్వర్‌రావు డిమాండ్ చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత లెక్కల ప్రకారం దేశంలో 15శాతం దివ్యాంగుల కుటుంబ సభ్యులు ఉండగా, 10 కోట్లకు పైగా ఓటర్లు ఉన్నారన్నారు. 2016 దివ్యాంగుల హక్కుల చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని, స్థానిక సంస్థల నుంచి చట్టసభల వరకు రాజకీయ రిజర్వేషన్లు, రాజ్యసభ, ఎమ్మెల్సీ, నామినేటెడ్ పదవుల్లో అన్ని పార్టీలు అవకాశం కల్పించాలన్నారు. తమను చులకనగా చూడొద్దని, అందరిలా సమాన హక్కు, అవకాశాలు ఇవ్వాలన్నారు. సమావేశంలో రాంబాబు, అరవింద్, రాజేంద్రప్రసాద్, విఠల్, బి.రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

యుసుఫ్‌గూడ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేసి అతడి వద్ద ఉన్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. రహ్మత్‌నగర్‌కు చెందిన ఆర్.వెంకటేష్ వృత్తి రీత్యా ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంటాడు. దీంతో పాటు గుట్టు చప్పుడు కాకుండా మద్యం బాటిల్స్ విక్రయిస్తున్నాడు. ఈవిషయం పలువురు గుర్తు తెలియని వ్యక్తులు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ సాయినాథ్‌రెడ్డి శుక్రవారం రాత్రి రహ్మత్‌నగర్ పోచమ్మగుడి వద్ద నిఘా నిర్వహించాడు. ఈ సమయంలో వెంకటేష్ అక్రమంగా మద్యం విక్రయిస్తూ పోలీసులకు దొరికాడు. అతడిని అదుపులోకి తీసుకొని 32 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

గంజాయి విక్రేత..

సనత్‌నగర్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): బీదర్ నుంచి గంజాయి తెచ్చి విక్రయిస్తున్న వ్యక్తిని మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు అరెస్ట్ చేశారు. తూర్పుగోదావరి జిల్లా సీతాంగరం ప్రాంతానికి చెందిన సూల సురేష్ నాయుడు(24) షాపూర్ సంజయ్‌గాంధీ నగర్‌లో ఉంటూ ఫ్యాబ్రికేషన్ పనిచేస్తున్నాడు. ఇతడికి బీదర్‌కు చెందిన గంజాయి విక్రేతతో పరిచయం ఏర్పడింది. బీదర్ నుంచి గంజాయిని తెచ్చి చిన్న ప్యాకెట్లలో పెట్టి సనత్‌నగర్ ప్రాంతంలో విద్యార్థులకు, కార్మికులకు విక్రయిస్తున్నాడు. ఇతడి దందాపై పక్కా సమాచారమందుకున్న మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు సనత్‌నగర్ ఎలికో సంస్థ సమీపంలో గంజాయి విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని గంజాయిని సనత్‌నగర్ పోలీసులకు అప్పగించారు.

వేర్వేరు ఘటనల్లో రెండు ఆటోలు మాయం

యుసుఫ్‌గూడ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ఘటనల్లో ఆటోలు మాయమైన ఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎల్లారెడ్డిగూడకు చెందిన మహ్మద్ రషీద్ ఆటో డ్రైవర్. ఈనెల 28వ తేదీ రాత్రి తన ఆటోను ఇంటి ఎదుట పెట్టి మరుసటిరోజు చూస్తే కనిపించలేదు. స్థానికులను విచారించినా ఫలితం లేదు. యూసుఫ్‌గూడ బస్తీలో నివాసముండే ఎస్.రాజశేఖర్ యూట్యూబర్‌గా పని చేస్తుంటాడు. ఈనెల 27వ తేదీ సాయంత్రం తన ఆటోలో కృష్ణకాంత్ పార్కు వద్దకు వెళ్లి తన ఆటోను పార్కు ఎదుట ఉంచి లోపలికి వెళ్లాడు. కొంత సమయం తర్వాత వచ్చి చూడగా తన ఆటో కనిపించలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గదిలో దాచిన ల్యాప్‌టాప్ చోరీ

యుసుఫ్‌గూడ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): గదిలో భద్రపరిచిన ల్యాప్‌టాప్ చోరీ చేశారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఎస్తేర్‌రాణి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. తన తండ్రి, సోదరుడితో కలిసి రహ్మత్‌నగర్ వీడియో గల్లీలో నివాసముంటుంది. ఈ నెల 28న తన ల్యాప్‌టాప్‌ను ఇంట్లోని తన గదిలో భద్రపరిచి తాళాలు వేసి వాష్ రూమ్‌లో పెట్టి బయటకు వెళ్లింది. మరుసటి రోజు వచ్చిన ఎస్తేర్ రాణికి తన గదిలోని ల్యాప్‌టాప్ కనిపించలేదు. తన తండ్రిని, సోదరుడిని అడిగిన తర్వాత మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా భారత్



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బంజారాహిల్స్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రపంచంలోనే భారతదేశం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచిందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్ గౌతంనగర్ చౌరస్తాలో పలు కుల సంఘాల నాయకులు, వివిధ రంగాల ప్రముఖులతో శుక్రవారం రాత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... భారత్ వైపు చూసేందుకు శత్రు దేశాలు కూడా భయపడే పరిస్థితి తీసుకొచ్చిన ఘనత ప్రధానమంత్రి మోదీకి దక్కుతుందన్నారు. అభివృద్ధి ఆకాంక్షించే వారంతా మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో పాటు అది బీజేపీకి పడేలా చూడాలని సూచించారు. బీజేపీకి ప్రధాని అభ్యర్థి మోదీ ఉన్నారు.. మరి కాంగ్రెస్‌కు ఎవరు ఉన్నారనేది ఆ పార్టీ నాయకులే సమాధానం చెప్పాలని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ హయాంలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే విధానాన్ని అవలంబిస్తుందన్నారు. ఆయా పార్టీలకు ఓటు వేయడంవల్ల సుస్థిరత కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. తెలంగాణ అభివృద్ధి విషయంలో బీజేపీ కొన్ని నిర్ణయాలు తీసుకుందని, వాటిని త్వరలోనే అమలు చేసేందుకు సమాయత్తమవుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ మోదీని చూసి బీజేపీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు గౌతమ్ రావు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఖైరతాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి గడ్డం వెంకటస్వామి, ముద్దంగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాలలపై విషప్రచారం మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

పంజాగుట్ట, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మాల సామాజిక వర్గానికి పది సంవత్సరాలుగా తెలంగాణ నుంచి పార్లమెంటులో ప్రాతినిధ్యం లేదని, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ రెండు ఎంపీ సీట్లు ఇస్తే తమ సోదరులు విమర్శించడం తగదని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య అన్నారు. మాలలపై విషప్రచారాన్ని మానుకోవాలని ఆయన అన్నారు. బంజారాహిల్స్‌లోని మాల మహానాడు జాతీయ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాల సంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్లు బూర్గుల వెంకటేశ్వర్లు, జి.రమేష్, మన్నె శ్రీధర్‌రావుతో కలిసి ఆయన మాట్లాడుతూ.. మాదిగ సామాజిక వర్గానికి చెందిన సంఘాలు గతం నుంచి తెలుగు దేశం, బీఆర్ఎస్ పార్టీకి, బీజేపీకి మద్దతిస్తూ.. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీని సీట్లు అడగడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకే ఎక్కువ సీట్లు ఇస్తూ వచ్చాయని, అయినా తాము ఏ రోజూ అడ్డుకోలేదని విమర్శించలేదన్నారు. ఎలాంటి ఆధారాలు, జనాభా లెక్కలు లేకుండా తెలంగాణలో మాదిగల జనాభా ఎక్కువగా ఉందని చెప్పడం నిజం కాదని, మాల మాదిగల జనాభా సమానంగా ఉంటుందన్నారు. పెద్దపల్లిలో మాలలు, మాల ఉపకులాల జనాభా మాదిలకంటే ఎక్కువగా ఉంటుంది. నాగర్ కర్నూల్‌లో కూడా సమానంగా ఉంటారు అలాంటిది ఆ సీట్లు మాదిగలకు ఇవ్వమనడం సరికాదన్నారు. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీకి అండగా ఉన్నామని, గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ఎంతో కృషి చేశామన్నారు. ఎస్సీ కులాలను మొదటి నుంచి కాపాడుకుంటూ వచ్చింది తామేనని గుర్తుంచుకోవాలన్నారు. ఇప్పటికైనా తమ సామాజికవర్గంపై విష ప్రచారాన్ని మానుకోవాలన్నారు. సమావేశంలో మాల మహానాడు గ్రేటర్ అధ్యక్షుడు బైండ్ల శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.రాజేష్, ప్రధాన కార్యదర్శి బంగి ఆనం ద్‌రావు, కళ్యాణ్, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఎస్సీ ఉపకులాలకు ఎంపీ సీటు కేటాయించాలి

- పెద్దపల్లి లేదా వరంగల్ స్థానం నుంచి అవకాశం కల్పించాలి

పంజాగుట్ట, మార్చి 30(ఆంధ్రజ్యోతి): దళితుల్లో 35 శాతం జనాభా ఉండి అత్యంత వెనుకబడ్డ ఉపకులాలకే పెద్దపల్లి లేదా వరంగల్ ఎంపీ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కేటాయించాలని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు భైరి వెంకటేశం మోచి పార్టీ అధిష్టానానికి, టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్ రెడ్డికి శనివారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో అధికారిక లెక్కల ప్రకారం 63లక్షల దళిత జనాభా ఉంటే.. అందులో మాదిగలు 25లక్షలు, మాలలు 17లక్షల జనాభా ఉంటే మిగతా... ఉపకులాలు 22 లక్షల జనాభాను కలిగి ఉన్నారని అన్నారు. ఇప్పటివరకు ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, రాజ్యసభ, ఎస్సీ కమిషన్ మొదలైన రాజ్యాంగబద్ధ పదవులన్నీ మాల, మాదిగలే అనుభవించారన్నారు. పెద్దపల్లి, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మాల, మాదిగలకంటే తమదే ఎక్కువ జనాభా ఉందని, కాంగ్రెస్ పార్టీ రెండు నియోజకవర్గాల్లో ఒక స్థానం ఇస్తే అత్యధిక మెజారిటీతో అభ్యర్థిని గెలిపిస్తామన్నారు. కడియం శ్రీహరి ఇప్పటికీ తాను మాదిగననే చెప్పుకున్నారని ఆయనకు ఎస్సీ ఉపకులాలతో ఎలాంటి సంబంధం లేదన్నారు. పార్లమెంట్ టికెట్ ఇవ్వకపోతే రాజ్యసభ, ఎమ్మెల్సీ అయినా ఇవ్వాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ ఉపకులాల కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని, కుల ధ్రువీకరణ పత్రాలు ఆర్డీవో ద్వారా కాకుండా తహసీల్దార్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు పరిష్కరించక పోయినా ఒక ఎంపీ టికెట్ ఇవ్వక పోయినా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిస్తామని హెచ్చరించారు.

దేశంలో జనాభా నియంత్రణకు కఠిన చట్టాలు రావాలి



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సుప్రీంకోర్టు న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ

ఖైరతాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): దేశంలో జనాభా పెరుగుదలవల్ల ఎన్నో సమస్యలు వస్తున్నాయని, వాటిని నియంత్రించాలంటే జనాభా నియంత్రణపై చట్టాలు రావాల్సిన అవసరం ఉన్నదని సుప్రీంకోర్టు న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ అన్నారు. ప్రజ్ఞా భారతి ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో నేషనల్ పాపులేషన్ పాలసీ ఫర్ ప్రాస్పరస్ అండ్ పవర్‌ఫుల్ భా రత్ అనే అంశంపై ప్రసంగ కార్యక్రమం నిర్వ హించారు. ఇందులో అశ్విని ఉపాధ్యాయ వక్తగా మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా ఒకే చట్టం వస్తే గాని జనాభా నియంత్రణ సాధ్యపడదన్నారు. అమెరికా లాంటి దేశాల్లో చట్టాలను కఠినంగా అమలు చేస్తారని, మన దేశంలో అవి సరిగ్గా అమలు కావడంలేదన్నారు. పాశ్చాత్య దేశాల్లో అబద్ధం ఆడితే శిక్ష పడుతుందని, మన దేశంలో అబద్ధం ఆడడం జన్మ హక్కుగా భావిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజ్ఞాభారతి చైర్మన్ పద్మశ్రీ డాక్టర్ త్రిపురనేని హనుమాన్ చౌదరి, అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎం.రఘు, ఉపాధ్యక్షురాలు విజయ భారతి, ఎల్‌వి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం: ఎమ్మెల్యే గోపీనాథ్



రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో ఎమ్మెల్యే గోపీనాథ్

యూసుఫ్‌గూడ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మానవాళికి ఏసుక్రీస్తు బోధించిన బోధనలు అనుసరణీయమని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. జూబ్లీహిల్స్ క్రిస్టియన్ ఫోరమ్ ఆధ్వర్యంలో శనివారం తెల్లవారు జామున రన్‌ఫర్ జీసస్ కార్యక్రమం యూసుఫ్‌గూడ వెంకటగిరి నుంచి తదితర ప్రాంతాల మీదుగా యూసుఫ్‌గూడ కృష్ణకాంత్ పార్కు వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ... మానవులలో చైతన్యం నింపేందుకు క్రీస్తు బోధనలు చేశాడని, ప్రేమ, దయతో జీవితం సాగించాలని ఆయన సూచించారని, అందరి కోసం ఆయన ప్రాణాలు అర్పించారన్నారు. ఈ సందర్భంగా క్రిస్టియన్ యువతీ, యువకులు క్రీస్తు పాటలను ఆలపించారు. కార్యక్రమంలో జూబ్లీహిల్స్ క్రిస్టియన్ ఫోరమ్ నాయకులు, చర్చిల ప్రతినిధులు డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ ఏసురాజ్, జోసఫ్ నాగేశ్వరరావు, విజయకుమార్, రాకేష్, క్రిష్టోఫర్, బాబురావు, జీవన్, విలియమ్, హనోక్‌రాజ్, వినోద్‌కుమార్, వసంతరావువ, ఫ్రాంక్లిన్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ రాయితీతో ఆస్తిపన్ను చెల్లింపునకు నేడు ఆఖరు

- ఖైరతాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు



జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ కార్యాలయం

ఖైరతాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): బకాయి ఉన్న ఆస్తిపన్నుపై విధించిన వడ్డీలో 90 శాతం రాయితీతో పన్ను చెల్లించేందుకు ఆదివారం చివరి రోజు కావడంతో అధికారులు పలు ఏర్పాట్లు చేశారు. ఖైరతాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ సర్కిళ్ల ఆస్తిపన్ను చెల్లింపుల కోసం కస్టమర్ సర్వీస్ సెంటర్‌లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. వడ్డీపై రాయితీతో చివరి రోజున పన్ను బకాయిలను చెల్లించే అవకాశాన్ని అందరూ సద్వినియోగపరచుకోవాలని సర్కిల్-17, 18, ఉప కమిషనర్లు జగన్, ప్రశాంతి తెలిపారు. పన్నును మీసేవా కార్యాలయాలు, బిల్ కలెక్టర్లు, టాక్స్ ఇన్‌స్పెక్టర్లకు గాని మున్సిపల్ కార్యాలయంలోని వినియోగదారుల సేవా కేంద్రంలో గాని, ఆన్‌లైన్ ద్వారా గాని చెల్లించొచ్చని వారు తెలిపారు. దీంతో పాటు ఆస్తిపన్ను పరిష్కార వేదికలు ఆదివారం పనిచేస్తాయని, దీని కోసం కార్యాలయంలో ప్రత్యేక టేబుళ్లను ఏర్పాటు చేసుకొని సిబ్బంది అందుబాటులో ఉంటారని, పన్ను సమస్యలపై ఏ వివాదాలున్నా వెంటనే పరిష్కరింప జేసుకోవచ్చని వారు తెలిపారు. సర్కిల్ 18లో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ. 176కోట్ల పన్ను వసూలు కాగా చివరి రోజున పెద్ద మొత్తంలో వసూలు లక్ష్యంగా పనిచేస్తున్నారు. గత సంవత్సరం రూ. 168 కోట్లు వసూలు కాగా, ఈసారి పన్ను లక్ష్యం రూ. 230 కోట్లుగా నిర్ణయించారు. ఖైరతాబాద్ మున్సిపల్ కార్యాలయంలోని సీఎస్‌సీలో ఆదివారం రాత్రి 12 గంటల వరకు పన్ను స్వీకరించేందుకు సిబ్బంది అందుబాటులో ఉంటారు.

బల్కంపేట ఎల్లమ్మ హుండీల ఆదాయం రూ. 40,01,324 లక్షలు



ఎల్లమ్మ ఆలయంలో హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న అర్చకులు

అమీర్‌పేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ ఆలయం హుండీల ఆదాయాన్ని శనివారం లెక్కించారు. 40రోజులకు సంబంధించి ఆదాయం రూ. 40,01,324 లక్షలు వచ్చినట్లు ఈవో కుంట నాగరాజు వెల్లడించారు. జనరల్ హుండీలలో నోట్లు రూ. 38,12,468 లక్షలు రాగా, నాణెలు 1,08,308లక్షలు వచ్చాయి. అన్నదానం హుండీలో రూ. 80,545 వచ్చాయి. ఈ హుండీలో రూ. 3,45,501 లక్షలు వచ్చాయి. వీటితో పాటు 56 యూఎస్ డాలర్లు, 7 కెనడా డాలర్లు, 7 యూకే పౌండ్స్, 20 ఆస్ట్రేలియ డాలర్స్, 5 మలేషియన్ రింగిట్స్ 5 ఖతార్ రియాల్స్ వచ్చాయి. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన లెక్కింపు సాయంత్రం 5 గంటలకు ముగిసింది. కార్యక్రమంలో చైర్మన్ సాయిబాబా గౌడ్, ధర్మకర్తలు ప్రభుగౌడ్, సురేష్ గౌడ్. కూతురు నర్సింహ, పుష్పలతతో పాటు దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి అర్చక సిబ్బంది పాల్గొన్నారు.



ఖైరతాబాద్ నియెజకవర్గంలో ఎస్సీ సెల్ డివిజన్ల అధ్యక్షులుగా నియమితులైన వారికి శనివారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ విజయారెడ్డి నియామక పత్రాలు అందజేశారు. ఖైరతాబాద్ డీసీసీ ఎస్సీసెల్ అధ్యక్షుడు ధన్‌రాజ్ రాథోడ్, మోహన్ యాదవ్ పాల్గొన్నారు. - ఖైరతాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి)



పోటీలను ప్రారంభిస్తున్న సీపీ ఆనంద్

హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ షురూ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభోత్సవం ఉల్లాసంగా జరిగింది. శనివారం నగరంలోని లేక్ వ్యూ టెన్నిస్ అకాడమీలో రాష్ట్ర ఏసీబీ డీజీ సీవీ ఆనంద్, హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ సంఘం (హెచ్‌ఓటీఏ) అధ్యక్షుడు, మాదాపూర్ డీసీపీ నంద్యాల నరసింహా రెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ టోర్నీలో దేశ వ్యాప్తంగా 300 మందికి పైగా క్రీడాకారులు పోటీ పడుతున్నారు. పురుషుల ఓపెన్ కేటగిరీలో 30, 40, 50, 60, 70ప్లస్ వయో విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. అన్ని విభాగాల్లోనూ విజేతకు రూ. 3 లక్షల నగదు బహుమతిని అందించనున్నారు. ప్రారంభ వేడుకల్లో హెచ్‌ఓటీఏ కార్యవర్గసభ్యులు శ్రీనివాస్, సదాశివ రెడ్డి, రమణ, మెహార్, చక్రి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ వర్సిటీలో క్రీడలకు ప్రత్యేక గ్రౌండ్

- వీసీ ప్రొ.కె.సీతారామారావు

హైదరాబాద్ సిటీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు రోజూ వ్యాయామం చేయడంతో పాటు క్రీడల్లో పాల్గొంటే రోజంతా ఉత్సాహంగా ఉండొచ్చని డా.బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ వీసీ ప్రొ.కె.సీతారామారావు అన్నారు. భారతరత్న డా.బాబా సాహెబ్ అంబేడ్కర్ 133వ జయంతిని పురస్కరించుకొని డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలను వర్సిటీ ప్రాంగణంలో వీసీ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో యూనివర్సిటీ ప్రాంగణంలో క్రీడలకు ప్రత్యేక గ్రౌండ్ ఏర్పాటు చేసి అన్ని వసతులు కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొ.ఏ.వి ఆర్.ఎన్.రెడ్డి, అన్ని విభాగాల అధిపతులు, డీన్స్, బోధన, బోధనేతర సిబ్బంది, బోధనేతర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి.మహేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వీ.ఎం.శర్మ, క్రీడా కార్యదర్శిలు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని లారీ.. లైసెన్స్‌లేని డ్రైవర్

- ఇద్దరి మృతికి కారణం
- రోడ్డు ప్రమాదం కేసులో ముగ్గురి అరెస్టు
- పరారీలో డ్రైవర్, ఫ్లైఓవర్ నిర్మాణ సంస్థ ఎండీ

బోయినపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఫిట్‌నెస్ లేని లారీతో లైసెన్స్ లేని డ్రైవర్ చేసిన ప్రమాదం వల్ల రెండు నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. చేసిన తప్పును కప్పిపుచ్చుకోవడానికి లారీ యజమాని మరో నేరం చేశాడు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ స్థానంలో నకిలీ డ్రైవర్‌ను చూపించి పోలీసులను తప్పుదోవ పట్టించాడు. దర్యాప్తు చేసిన పోలీసులు లారీ యజమానితో పాటు.. ప్రమాదానికి కారణమైన ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో లారీ డ్రైవర్, ఫ్లైఓవర్ నిర్మాణ పనులు చేస్తున్న సంస్థ ఎండీ పరారీలో ఉన్నారు. శనివారం బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌లో నార్త్‌జోన్ శాంతిభద్రతల విభాగం డీసీపీ రోహిణి ప్రియదర్శిని, ట్రాఫిక్ డీసీపీ సుబ్బారాయుడుతో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మేడ్చల్ జాతీయ రహదారిలోని మిలటరీ డైరీఫాం సమీపంలో లక్ష్మీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టింది. అక్కడ ఎలాంటి ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. మార్చి 24 అర్ధరాత్రి 44వ పిల్లర్ వద్ద భారత్ ఫైబర్ కేబుల్‌కు సంబంధించిన వైర్లు కిందపడ్డాయి. అవి తగిలి ఓ వాహనదారుడు కిందపడ్డాడు. వైర్లను తొలగించే క్రమంలో వాహనాలు ఆగాయి. అదే సమయంలో సుచిత్ర నుంచి వేగంగా వస్తున్న లారీ ముందున్న రెండు ద్విచక్రవాహనాలను ఢీకొంది. ఈ ఘటనలో ఓ బైక్‌పై ఉన్న ఆకాశరాజ్, నందిని అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరు గాయపడ్డారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారయ్యాడు. సమాచారం అందుకున్న బోయినపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

- డ్రైవర్‌ను మార్చేసి, పోలీసులను ఏ మార్చి..

ప్రమాదానికి కారణమైన లారీకి ఫిట్‌నెస్ లేదని, డ్రైవర్‌కు లైసెన్స్ లేదని తెలిసిన లారీ యజమాని ఎలాగైనా కేసు నుంచి బయటపడాలని ప్లాన్ వేశాడు. పారిపోయిన డ్రైవర్ స్థానంలో లైసెన్స్ ఉన్న నకిలీ డ్రైవర్‌ను పెట్టి పోలీసులకు అప్పగించాడు. ఈ కేసులో భద్రత చర్యలు తీసుకోని ఫ్లైఓవర్ నిర్మాణ పనులు చేస్తున్న సంస్థ ప్రాజెక్టు మేనేజరైన విజయవాడకు చెందిన కె.రాఘవేంద్ర, ఖైరతాబాద్‌కు చెందిన భారత్ ఫైబర్‌నెట్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గడ్డం పూర్ణచందర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ జరుపుతున్న క్రమంలో లారీ నడిపిన డ్రైవర్ లొంగిపోయిన వ్యక్తి కాదని, వేరే వ్యక్తి అయి ఉంటాడని పోలీసులకు అనుమానం వచ్చింది. లొంగిపోయిన డ్రైవర్‌ను తమదైన శైలిలో విచారించగా యజమాని సూచనతోనే లొంగిపోయానని అతడు వెల్లడించాడు.

అతడిచ్చిన సమాచారంతో మెదక్ జిల్లా రామాయంపేటకు చెందిన లారీ యజమాని అర్జున్‌సింగ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మరో నిర్మాణ సంస్థ లక్ష్మీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎండీ వేములపల్లి కిరణ్‌కుమార్, ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ ఉర్జి షేక్ పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.



అనిల్ ఆడేకర్‌కి వీడ్కోలు పలుకుతున్న షేక్ రవూఫ్

రైల్వేలో 71మంది పదవీ విరమణ

చిలకలగూడ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్‌లో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న 71మంది ఉద్యోగులు శనివారం పదవీ విరమణ చేశారు. హెడ్‌క్వార్టర్స్, సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్లతోపాటు లాలాగూడ వర్క్‌షాపులో వీరు పనిచేశారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, అధికారులకి ఆత్మీయ వీడ్కోలు పలికారు. వివిధ కార్మిక సంఘనాయకులు షేక్ రవూఫ్, ఏ.జీ.కే.మూర్తి, చింతకుంట రామకృష్ణ అకౌంట్స్ విభాగంలో పదవీ విరమణ చేసినవారిని శాలువ, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి ఆత్మీయ వీడ్కోలుపలికారు.



హుండీ లెక్కింపులో అధికారులు

శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయ హుండీ ఆదాయం రూ.1,74,009

రాంగోపాల్‌పేట్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఎస్పీ రోడ్డులోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయ హుండీ ఆదాయం ఒక లక్ష డెబ్బై నాలుగు వేల తొమ్మిది రూపాయలు (రూ.1,74,009) వచ్చింది. అరవై రోజులకు గాను శనివారం ఆలయ ప్రాంగణంలో జరిగిన హుండీ లెక్కింపులో ఈ ఆదాయం వచ్చింది. సికింద్రాబాద్ పంచముఖి హనుమాన్ దేవాలయ కార్యనిర్వాహణాధికారి అన్నారావు, పోలీసుల పర్యవేక్షణలో జరిగిన హుండీ లెక్కింపులో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసశర్మ, ప్రధాన అర్చకులు చింతపట్ల భద్రీనాదాచార్యులు, దేవాలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



వరంగల్‌లోని కాళోజీ నారాయణ విశ్వవిద్యాలయం సైన్స్ కాలేజీ ఆవరణలో ఈనెల 24 నుంచి 29 వరకు జరిగిన క్రీడా పోటీల్లో సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ వైద్యవిద్యార్థులు పలు అవార్డులు, ప్రశంసాపత్రాలను సాధించారు. 79 మెడికల్ కాలేజీల నుంచి 700 మంది వైద్య విద్యార్థులు టెన్నీస్, బ్యాట్మెంటిన్, బాస్కెట్‌బాల్, రన్నింగ్ పోటీల్లో పాల్గొన్న గాంధీ మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచి అవార్డులను అందుకున్నారు. విజయం సాధించిన గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ కృష్ణ మోహన్, డాక్టర్ వేణులు ప్రత్యేక అభినందనలు తెలిపి వీరిని ఘనంగా సన్మానం చేశారు.

- అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి

సీనియర్ సిటిజన్స్‌కి ఆటల పోటీలు

చిలకలగూడ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): హెల్దీ సీనియర్ సిటిజన్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ 5వ వార్షికోత్సవం పురస్కరించుకుని సీనియర్ సిటిజన్స్‌కి పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యదర్శులు ఆర్.పి.భగవాన్, ఎం.ఆర్.పి.బాబు ఒక ప్రకటనలో తెలిపారు. 55సంవత్సరాల నుంచి 100సంవత్సరాల వయసుపైబడిన వారికి వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నట్లు సికింద్రాబాద్ రైల్ నిలయం, రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఏప్రిల్ 13వ తేది శనివారం ఉదయం 7గంటలకి ప్రారంభమవుతాయని, ఆసక్తి గలవారు 7వ తేది లోపు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. పరుగు పందెం, లాంగ్‌జంప్, ట్రిపుల్ జంప్, డిస్కస్‌త్రో, షాట్‌పూట్, జావెలిన్, హ్యామర్ త్రోలలో పోటీలు వుంటాయని, విజేతలకి సర్టిఫికెట్‌తో పాటు మెడల్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. బయటి నుంచి వచ్చేవారికి వసతి సౌకర్యం వుందని, మరిన్ని వివరాలకి 9290744738 నెంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫాం నెంబరు 2, 3లో గుర్తుతెలియని 55 ఏళ్ల వృద్ధుడు చనిపోయి ఉండగా సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని గాంధీ మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అనారోగ్యం కారణంగానే చనిపోవచ్చని రైల్వే పోలీసులు బావిస్తున్నారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ




నర్సమ్మ

రాజేంద్రనగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి మెడలోనుంచి రెండు తులాల బంగారు గొలుసును గుర్తు తెలియని మహిళ లాక్కొని పారిపోయింది. వివరాల్లోకి వెళితే... రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్‌పల్లిలో నర్సమ్మ(80) అనే వృద్ధురాలు ఒంటరిగా తన ఇంట్లో నివాసం ఉంటుంది.

పక్కనే వారి బంధువులు ఉంటారు. శనివారం ఉదయం 5:30 గంటలకు వాకిలి శుభ్రం చేసి ముగ్గుపెట్టిన నర్సమ్మ ఇంట్లోకి వెళ్లింది. ఆ సమయంలో వెనక నుంచి వచ్చిన గుర్తుతెలియని మహిళ ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయింది. నర్సమ్మ అరుపులకు చుట్టుపక్కల వారు, బంధువులు వచ్చి చూసే లోపే అక్కడ ఎవరు కనిపించలేదు. దీంతో నర్సమ్మ కుటుంబ సభ్యులు రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దంగల్ బిల్డింగ్ పూర్తయ్యేదెన్నడో?

కంటోన్మెంట్ మోండా డివిజన్ పరిధిలోని మారేడుపల్లి నెహ్రూనగర్ పార్క్ ఆవరణలో 2018లో దాదాపు రెండు కోట్ల రూపాయల వ్యయంతో అప్పటి ప్రభుత్వం 1800 వందల చదరపు అడుగుల స్థలంలో దంగల్ బిల్డింగ్ పనులను ప్రారంభించింది. నేటికి ఐదున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ 70శాతం మేరకే పనులు పూర్తి కాగా, మిగతా పనులు అసంపూర్ణంగా మిగిలి పోయాయి. ఇందులో గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్న (కుస్తీ పోటీల) సంబంధించిన దంగల్, ఫస్ట్ ఫ్లోర్‌లో లేటెస్ట్ టెక్నాలజీతో కూడిన వ్యాయమశాలను నిర్మించతలపెట్టారు. పెంట్ హౌస్ క్రీడాకారులకు సంబంధించిన ప్రత్యేక గదులను నిర్మించనున్నారు.



2018లో దంగల్ కుస్తీ బిల్డింగ్ ప్రారంభోత్సవ శిలాఫలకం



అసంపూర్తిగా నిలిచిపోయిన దంగల్ బిల్డింగ్ నిర్మాణ పనులు

మారేడ్‌పల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పనులు ప్రారంభించి ఐదున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ పనులు పూర్తి కాలేదు. దీంతో ఎంతో హంగు ఆర్భాటంతో ప్రారంభించిన దంగల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులు నిలిచిపోయాయి. క్రీడాకారులకు నేటికీ దంగల్ బిల్డింగ్ అందుబాటులోకి రాకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. దంగల్ బిల్డింగ్ పూర్తయి క్రీడాకారులకు అందుబాటులోకి వస్తే ఇక్కడ కుస్తీ పోటీలతో పాటు బాడీ బిల్డింగ్, బాక్సింగ్, ఇతర క్రీడా పోటీలను నిర్వహించేందుకు వీలుగా ఉంటుంది. ఇక్కడి ప్రజాప్రతినిధులు, అధికారులు దంగల్ బిల్డింగ్ పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావడంలో విఫలమయ్యారని పలువురు క్రీడాకారుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

త్వరలో పూర్తి చేస్తాం
జీహెచ్ఎంసీ ఏఈ రవీందర్

బిల్డింగ్ నిర్మాణ కాంట్రాక్టర్లు అందుబాటులో లేని కారణంగా దంగల్ బిల్డింగ్ పనులు నిలిచిపోయాయి. మొదటి కాంట్రాక్టర్‌కు ఇచ్చిన పనులు పూర్తి చేయగా, రెండవ విడతలో భాగంగా ఇచ్చిన కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారని వెంటనే ప్రారంభించాలని ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు, బ్లాక్ లిస్ట్‌లో పెట్టి మరో కాంట్రాక్టర్‌కు పనులను అప్పగించి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని అధికారి తెలిపారు. దాదాపు మరో 60 లక్షల రూపాయలకు సంబంధించిన పనులు మిగిలి ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా గ్రౌండ్ ఫోర్లో ప్రత్యేకంగా నిర్మిస్తున్న కుస్తీ పోటీలకు సంబంధించిన మైదానంలో ప్రత్యేకించి పంజాబ్ నుంచి పది లోడ్ల మట్టిని తీసుకురావలసి ఉంటుందని చెప్పారు. దంగల్ బిల్డింగ్‌ను పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా చూస్తామని చెప్పారు.

దంగల్ బిల్డింగ్ పనులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యం



మారేడుపల్లి నెహ్రూనగర్ పార్క్ ఆవరణలో దాదాపు రెండు కోట్ల రూపాయల వ్యయంతో దంగల్ (కుస్తీ) బిల్డింగ్ పనులను ప్రారంభించినప్పటికీ పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహించారు.
రెండు సంవత్సరాల వ్యవధిలో పూర్తి చేయవలసిన పనులను ఐదున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ పూర్తి కాలేదు. అధికారులు శ్రద్ధ చూపి స్పోర్ట్స్ కాంప్లెక్స్ బిల్డింగ్ మిగతా పనులను పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నాము

- ఎస్.కుమార్,
వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడు

ఇద్దరి మృతికి కారణమైన ఫిట్‌నెస్ లేని లారీ.. లైసెన్స్‌లేని డ్రైవర్

- రోడ్డు ప్రమాదం కేసులో ముగ్గురి అరెస్టు
- పరారీలో డ్రైవర్, ఫ్లైఓవర్ నిర్మాణ సంస్థ ఎండీ

బోయిన్‌పల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఫిట్‌నెస్ లేని లారీతో లైసెన్స్ లేని డ్రైవర్ చేసిన ప్రమాదం వల్ల రెండు నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. చేసిన తప్పును కప్పిపుచ్చుకోవడానికి లారీ యజమాని మరో నేరం చేశాడు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ స్థానంలో నకిలీ డ్రైవర్‌ను చూపించి పోలీసులను తప్పుదోవ పట్టించాడు. దర్యాప్తు చేసిన పోలీసులు లారీ యజమానితో పాటు.. ప్రమాదానికి కారణమైన ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో లారీ డ్రైవర్, ఫ్లైఓవర్ నిర్మాణ పనులు చేస్తున్న సంస్థ ఎండీ పరారీలో ఉన్నారు. శనివారం బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌లో నార్త్‌జోన్ శాంతిభద్రతల విభాగం డీసీపీ రోహిణి ప్రియదర్శిని, ట్రాఫిక్ డీసీపీ సుబ్బారాయుడుతో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మేడ్చల్ జాతీయ రహదారిలోని మిలటరీ డైరీఫాం సమీపంలో లక్ష్మీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టింది. అక్కడ ఎలాంటి ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. మార్చి 24 అర్ధరాత్రి 44వ పిల్లర్ వద్ద భారత్ ఫైబర్ కేబుల్‌కు సంబంధించిన వైర్లు కిందపడ్డాయి. అవి తగిలి ఓ వాహనదారుడు కిందపడ్డాడు. వైర్లను తొలగించే క్రమంలో వాహనాలు ఆగాయి. అదే సమయంలో సుచిత్ర నుంచి వేగంగా వస్తున్న లారీ ముందున్న రెండు ద్విచక్రవాహనాలను ఢీకొంది. ఈ ఘటనలో ఓ బైక్‌పై ఉన్న ఆకాశరాజ్, నందిని అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరు గాయపడ్డారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారయ్యాడు. సమాచారం అందుకున్న బోయినపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

- డ్రైవర్‌ను మార్చేసి, పోలీసులను ఏ మార్చి..

ప్రమాదానికి కారణమైన లారీకి ఫిట్‌నెస్ లేదని, డ్రైవర్‌కు లైసెన్స్ లేదని తెలిసిన లారీ యజమాని ఎలాగైనా కేసు నుంచి బయటపడాలని ప్లాన్ వేశాడు. పారిపోయిన డ్రైవర్ స్థానంలో లైసెన్స్ ఉన్న నకిలీ డ్రైవర్‌ను పెట్టి పోలీసులకు అప్పగించాడు. ఈ కేసులో భద్రత చర్యలు తీసుకోని ఫ్లైఓవర్ నిర్మాణ పనులు చేస్తున్న సంస్థ ప్రాజెక్టు మేనేజరైన విజయవాడకు చెందిన కె.రాఘవేంద్ర, ఖైరతాబాద్‌కు చెందిన భారత్ ఫైబర్‌నెట్ సంస్థ మేనేజింగ్ డైరక్టర్ గడ్డం పూర్ణచందర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ జరుపుతున్న క్రమంలో లారీ నడిపిన డ్రైవర్ లొంగిపోయిన వ్యక్తి కాదని, వేరే వ్యక్తి అయి ఉంటాడని పోలీసులకు అనుమానం వచ్చింది. లొంగిపోయిన డ్రైవర్‌ను తమదైన శైలిలో విచారించగా యజమాని సూచన తోనే లొంగిపోయానని అతడు వెల్లడించాడు. అతడిచ్చిన సమాచారంతో మెదక్ జిల్లా రామాయంపేటకు చెందిన లారీ యజమాని అర్జున్‌సింగ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మరో నిర్మాణ సంస్థ లక్ష్మీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎండీ వేములపల్లి కిరణ్‌కుమార్, ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ ఉర్జి షేక్ పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.



క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న డా.బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ వీసీ ప్రొ.కె.సీతారామారావు

అంబేడ్కర్ వర్సిటీ ప్రాంగణంలో త్వరలో క్రీడలకు ప్రత్యేక గ్రౌండ్

- వర్సిటీ వీసీ ప్రొ.కె.సీతారామారావు

హైదరాబాద్ సిటీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు ప్రతిరోజు వ్యాయామం చేయడంతో పాటు క్రీడల్లో పాల్గొంటే రోజుంతా ఉత్సాహంగా ఉండొచ్చని డా.బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ వీసీ ప్రొ.కె.సీతారామారావు అన్నారు. భారతరత్న డా.బాబా సాహెబ్ అంబేడ్కర్ 133వ జయంతిని పురస్కరించుకొని డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలను వర్సిటీ ప్రాంగణంలో వీసీ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొ.ఏ.వి ఆర్.ఎన్.రెడ్డి, అన్ని విభాగాల అధిపతులు, డీన్స్, బోధన, బోధనేతర సిబ్బంది, బోధనేతర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి.మహేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వీ.ఎం.శర్మ, క్రీడా కార్యదర్శులు ఎం.బుద్ధా, ఎన్.మహేష్‌బాబు, విశ్వనాథ్‌లు పాల్గొన్నారు.

మాలలపై విషప్రచారం మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

పంజాగుట్ట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మాల సామాజిక వర్గానికి పది సంవత్సరాలుగా తెలంగాణ నుంచి పార్లమెంటులో ప్రాతినిధ్యం లేదని, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ రెండు ఎంపీ సీట్లు ఇస్తే తమ సోదరులు విమర్శించడం తగదని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య అన్నారు. మాలలపై విషప్రచారాన్ని మానుకోవాలని ఆయన అన్నారు. బంజారాహిల్స్‌లోని మాల మహానాడు జాతీయ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాల సంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్లు బూర్గుల వెంకటేశ్వర్లు, జి.రమేష్, మన్నె శ్రీధర్‌రావుతో కలిసి ఆయన మాట్లాడుతూ.. మాదిగ సామాజిక వర్గానికి చెందిన సంఘాలు గతం నుంచి తెలుగు దేశం, బీఆర్ఎస్ పార్టీకి, బీజేపీకి మద్దతిస్తూ.. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీని సీట్లు అడగడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకే ఎక్కువ సీట్లు ఇస్తూ వచ్చాయని, అయినా తాము ఏ రోజూ అడ్డుకోలేదని విమర్శించలేదన్నారు. ఎలాంటి ఆధారాలు, జనాభా లెక్కలు లేకుండా తెలంగాణలో మాదిగల జనాభా ఎక్కువగా ఉందని చెప్పడం నిజం కాదని, మాల మాదిగల జనాభా సమానంగా ఉంటుందన్నారు. పెద్దపల్లిలో మాలలు, మాల ఉపకులాల జనాభా మాదిలకంటే ఎక్కువగా ఉంటుంది. నాగర్ కర్నూల్‌లో కూడా సమానంగా ఉంటారు అలాంటిది ఆ సీట్లు మాదిగలకు ఇవ్వమనడం సరికాదన్నారు. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీకి అండగా ఉన్నామని, గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ఎంతో కృషి చేశామన్నారు. ఎస్సీ కులాలను మొదటి నుంచి కాపాడుకుంటూ వచ్చింది తామేనని గుర్తుంచుకోవాలన్నారు. ఇప్పటికైనా తమ సామాజికవర్గంపై విష ప్రచారాన్ని మానుకోవాలన్నారు. సమావేశంలో మాల మహానాడు గ్రేటర్ అధ్యక్షుడు బైండ్ల శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.రాజేష్, ప్రధాన కార్యదర్శి బంగి ఆనంద్ రావు, కళ్యాణ్, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే పోర్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎంపాయిస్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘువయ్య

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో పనిచేస్తున్న రైల్వే పోర్టర్ల సమస్యలపై ఎంప్లాయిస్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘువయ్య దృష్టికి తీసుకెళ్లి సమస్యల్ని పరిష్కరించేందుకు కృషి చేస్తానని రైల్వే విశ్రాంత అధికారి రాఘువయ్య సూచించారు. శనివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రైల్వే పోర్టర్లతో ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో బ్యాటరీ కార్ల వల్ల రైల్వే కూలీల ఆదాయం కోల్పోతున్నారని కుటుంబాన్ని పోషించుకోలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. రైల్వే కూలీలకు (పోర్టర్లు) ప్రభుత్వం కల్పించిన రైల్వే వైద్య సదుపాయాల్ని కల్పించడంలేదని, ఉచిత పాస్‌లు కల్పించడంలేదన్నారు. 8ఏళ్లుగా రైల్వే కూలీలకు యూనిఫాం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. వెంటనే రైల్వే కూలీల సమస్యల్ని పరిష్కరించి వెంటనే సత్వర పరిష్కరించేందుకు రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘువయ్య దృష్టికి తీసుకెళ్లి రైల్వే కూలీల కష్టాలను ఆయన దృష్టికి తీసుకెళ్ళి రైల్వే అధికారులచే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.



రైల్వే స్టేషన్‌లో రైల్వే పోర్టర్ల ను ఉద్దేశించి మాట్లాడుతున్న విశ్రాంతి రైల్వే అధికారి రాఘువయ్య

మాదిగల సింహగర్జనను విజయవంతం చేయాలి

- శ్రీకిషన్ మాదిగ

బోయిన్‌పల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గంకు జరుగనున్న ఉప ఎన్నికలలో ప్రధాన పార్టీలు మాదిగలకు టికెట్ కేటాయించాలనే సంకల్పంతో నిర్వహించనున్న కంటోన్మెంట్ మాదిగల సింహగర్జనను విజయవంతం చేయాలని కంటోన్మెంట్ ఎంఆర్‌పీఎస్ నాయకుడు శ్రీకిషన్ మాదిగ అన్నారు. శనివారం డైమండ్ పాయింట్‌లో ఇటుక శ్రీకిషన్ మాదిగ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కంటోన్మెంట్‌లోని మాదిగలకు ప్రధానపార్టీలు టికెట్‌ను ఖరారు చేయాలని డిమాండ్ చేశారు. మాదిగలు గతకొన్ని సంవత్సరాలుగా మాదిగలకు అన్యాయం జరుగుతుందని, ఎస్సీ రిజర్వేషన్ ఉన్న నియోజకవర్గంలోని ఎస్సీలకు న్యాయం జరగడంలేదని అన్నారు. అనంతరం కంటోన్మెంట్ కంటెస్టెడ్ కార్పొరేటర్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా మాదిగలకు అన్యాయం జరుగుతుందని, ఏప్రిల్ 3న జరగబోయే మాదిగల సింహగర్జనలో తమ సత్తా చాటుతామని కంటోన్మెంట్‌లో అధికశాతం ఉన్న మాదిగలకు ఉప ఎన్నికలో సీటు కేటాయించాలని కోరారు.

కంటోన్మెంట్ ప్రాంతంలోని మాదిగలు అణచివేతకు గురవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో శారద, మల్లేష్, బొట్టు శంకర్ మాదిగ, అజిత్ కళ్యాణ్, రొట్టెల సునీల్ మాదిగ, ఇటుక గోపి మాదిగ, శ్రీకాంత్ మాదిగ, శి మాదిగ, ముది మాదిగ, రాజేందర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



మాదిగల సింహగర్జన ఏర్పాట్ల సమావేశంలో కంటోన్మెంట్ మాదిగ సామాజిక వర్గం నాయకులు



ప్రారంభోత్సవంలో కార్డినల్ బిషప్ పూల ఆంథోని

రన్‌ఫర్ జీసస్ ర్యాలీ

రెజిమెంటల్‌బజార్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ పండగ నేపథ్యంలో నిర్వహించిన రన్‌ఫర్ జీసస్ ర్యాలీని శనివారం సికింద్రాబాద్ సెయింట్ మేరీస్ బసలికా చర్చి ఆవరణలో కార్డినల్ బిషప్ పూల ఆంథోని జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీని ప్యాట్నీ, ట్యాంక్‌బండ్ మీదుగా ఆబిడ్స్ సెయింట్ జార్జియస్ స్కూలు వరకు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెథడిస్ట్ బిషప్ ఎంఏ డానియల్, థెరిస్సాపాల్, పాల్‌దేవప్రియం, ఉషాపాల్, రెవమోహన్ బాబు, చిరంజీవి, బిషప్ విల్సన్‌సింగం, రెవరాజ ఏబెల్, దీపక్‌జాన్, పాస్టర్లు, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

అవకాడో తోటల పెంపకంపై అవగాహన సదస్సు

రాజేంద్రనగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని ఫల పరిశోధనా స్థానంలో అవకాడో తోటల పెంపకంపై పరిశోధనలు ప్రారంభించామని కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ నీరజ ప్రభాకర్ తెలిపారు. ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఐజీ డెక్కన్ ఎక్సోటిక్స్ సహకారంతో రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల ప్రాంగణంలో శనివారం శాస్త్రీయ పరిజ్ఞానంతో అవకాడో తోటల పెంపకంపై అవగాహన సదస్సును నిర్వహించారు. సదస్సును శ్రీ కొండా లక్ష్మన్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ నీరజ ప్రభాకర్ ప్రారంభించి ప్రసంగించారు. అవకాడో పండ్లలో సమృద్ధిగా పోషక ఔషధ గుణాలు ఉన్నాయన్నారు. భవిష్యతులో మన రాష్ట్రంలో అవకాడో మొక్కల పెంపకాన్ని దృష్టిలో ఉంచుకుని అవకాడో మొక్కల పెంపకంపై పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. మాజీ ఉప కులపతి డాక్టర్ వి.ప్రవీణ్‌రావు మాట్లాడుతూ మన రాష్ట్రంలో అవకాడో తోటల పెంపకంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సరైన నేలను ఎంచుకుని వాటి గురించి తెలుసుకోవడం కోసం నేషనల్ బ్యూరో ఆఫ్ సైన్స్ సహకారంతో తోటలను పెంచే నేలల సమగ్ర సమాచారాన్ని తెలుసుకోవాలని పేర్కొన్నారు. డాక్టర్ శ్రీనివాస్ నిర్వహిస్తున్న అవకాడో క్షేత్రాన్ని రైతులు సందర్శించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన వర్సిటీ పరిశోధనా సంచాలకులు డాక్టర్ కిరణ్‌కుమార్, డీన్ ఆఫ్ హార్టికల్చర్ డాక్టర్ రాజశేఖర్, ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రశాంత్, శాస్త్రవేత్తలు హస్కల్చర్ నర్సరీస్ ఇజ్రాయెల్, డాక్టర్ కరుణాకర్, అమిత్ శర్మ, పాల్గొన్నారు.



ట్రాఫిక్ సమస్యపై చర్చిస్తున్న ట్రాఫిక్, ఆర్‌పీఎఫ్, ఆర్టీసీ అధికారులు

ట్రాఫిక్ సమస్య నివారణకు ఆర్టీసీ అధికారుల పరిశీలన

రెజిమెంటల్‌బజార్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు రాకపోకలు సాగించే వాహనాలతో సాధారణ ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేపట్టవలసిన చర్యలపై ట్రాఫిక్, ఆర్‌పీఎఫ్, ఆర్టీసీ అధికారులు పరిశీలించారు. శనివారం హైదరాబాద్ ట్రాఫిక్-1 డీసీపీ సుబ్బరాయుడు, అదనపు డీసీపీ రంగారావు, ఏసీపీ శంకర్ రాజు, ఆర్టీసీ మేనేజర్ విజయ్‌కుమార్‌లు రైల్వే స్టేషన్ ప్రాంతంలో ట్రాఫిక్ నివారణకు తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం, మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌లు వెంకట్‌రాములు, ఉపశంకర్, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సరస్వతి, ఎస్సై, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



స్థానిక మహిళలు, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న బీఆర్ఎస్ నాయకురాలు జి.నివేదిత

పికెట్ గాంధీ హట్స్‌లో పర్యటించిన జి.నివేదిత, పి.నళినీ కిరణ్

మారేడుపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని 4వ వార్డు పికెట్ గాంధీ కాలనీలో కంటోన్మెంట్ బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు జి.నివేదిత శనివారం పర్యటించారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యురాలు నళిని కిరణ్‌తో కలిసి ఆమె స్థానిక కాలనీవాసులను ఆత్మీయంగా పలకరించారు. వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలంతా నివేదితకు సంపూర్ణ మద్దతు పలికారు. దివంగత ఎమ్మెల్యే లాస్య నందిత సేవలను గుర్తుచేసుకున్నారు. ఎల్లవేళలా ప్రజలకు అండగా ఉండే సాయన్న కుటుంబానికి తాము అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్, రామ్మోహన్, ఆనంద్, పరశురామ్, మహేష్, గణేష్, సురేఖ, యాకుబ్, ఇస్మాయిల్, నూర్, గజ్జెల గోపాల్, నిత్యానంద్, భాస్కర్ ముదిరాజ్, మల్లేష్, మురళి యాదవ్, దర్శన్ పాల్గొన్నారు.